ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
వరంగల్
ఉమ్మడి జిల్లా
గురువారం 2 అక్టోబరు 2025

దసరా వచ్చిందయ్యా...

- ఇంటింటా విందు వినోదాల సందడి
- ఆలయాల్లో శమీ పూజలు
- పలుచోట్ల రావణవధకు ఏర్పాట్లు పూర్తి
- పల్లెపట్నాల్లో పండుగ కోలాహలం



హనుమకొండ కల్చరల్ / వరంగల్ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ యేటా ఆశ్వయుజ మాసం శుక్లపక్షంలో దశమి తిథితో జరుపుకునే అతి పెద్ద హిందువుల పర్వం దసరా పండగను గురువారం జరుపుకునేందుకు ప్రజాలంతా సన్నద్ధమయ్యారు. పాండ్యమి మొదలుకొని అష్టమి వరకున్న పది రోజులు వైభవంగా శరన్నవరాత్రులు జరుపుకుని వివిధ అలంకారాల్లో అమ్మవారిని పూజించి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ అన్నట్లుగా చెడుపై మంచి సాధించిన విజయానికి నాందిగా దసరా పేరిట విజయదశమి పర్వాన్ని వైభవంగా జరుపుకోవడం ప్రతీ యేటా ఆనవాయితీగా వస్తోంది. పర్వదిన వేళ పొద్దున్నే లేచి తలంటు పోసుకొని నూతన వస్త్రాలను ధరించి ఇష్టదైవాలను పూజించిన అనంతరం పిండి వంటలు చేసుకొని మందు, విందుతో ఇంటిల్లిపాది ఉల్లాసంగా గడపడమే ఈ పర్వదిన ప్రత్యేకం. దీనికితోడు సాయంత్రం వేళ ఆలయాలను సందర్శించి జమ్మి చెట్టుకు

మిగతా 2వ పేజీలో...

Models	Reduction in Ex-Showroom Price (Up to INR Lakh)	New Ex-Showroom Starting Price after GST (INR Lakh)	Additional Benefits* (Up to INR Lakh)	Total Benefits (Upto INR Lakh)*
Tiago	0.75	4.57	0.45	1.12
Tigor	0.81	5.48	0.55	1.36
Punch	1.07	5.49	0.55	1.62
Altroz	1.11	6.30	1.45	2.56
Nexon	1.54	7.31	0.53	2.07
Curvv	0.67	9.65	0.48	1.15
Harrier	1.44	13.99	0.60	2.04
Safari	1.48	14.66	0.60	2.08

మహిషాసుర మర్దినిగా భద్రకాళి

- అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయం



మహిషాసుర మర్దిని అలంకరణలో భద్రకాళి అమ్మవారు

2

మహిషాసుర మర్దినిగా భద్రకాళి



అమ్మవారి సన్నిధిలో పూర్ణాహుతిలో పాల్గొన్న హైకోర్టు జడ్జి నందికొండ నర్సింగరావు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవం గా కొనసాగుతున్నాయి. బుధవారం రోజున అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 4 గంటల కు నిత్య పూజల అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి పూజ లు చేశారు. అనంతరం శరభ వాహనంపై, సాయంత్రం పుష్పరథంపై ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఈ సందర్భంగా యాగశాలలో జరిగిన ప్రత్యేక హోమంలో హైకోర్టు జడ్జి నందికొండ నర్సింగరావు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని హోమం అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. వారితో పాటు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ దర్శించుకున్నారు. బుధవారం అమ్మవారి దేవాలయానికి వీఐపీల తాకిడి పెరిగింది. పక్క జిల్లాలనుంచి అధికారులు అమ్మవారి దర్శనానికి తరలి వచ్చి దర్శించుకున్నారు.

ప్రత్యేక రోప్ పార్టీ ఏర్పాటు చేయాలి..

విజయదశమి, దసరా పండుగ సందర్భంగా గురువారం వేలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో పైరవీలకు తావీయకుండా సామాన్య భక్తులకు ధర్మ దర్శనానికి ప్రాధాన్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. సిబ్బంది సేవ అంటూ యువకులు గర్భాలయంలో ఉండి నెట్టి వేయడం లాంటి సంఘటనలతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్యూలైన్ల ద్వారా భక్తులు దర్శించుకునే విధంగా ప్రత్యేక రోప్ పార్టీ ఏర్పాటు చేయాలని, వీఐపీ లైన్లు, వికలాంగుల లైన్లు, మీడియా లైన్, భక్తుల ధర్మదర్శనం, ప్రత్యేక టికెట్ దర్శనం లైన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

భక్తుల కిటకిట

బుధవారం వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనార్థం తరలి వచ్చారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా ధర్మదర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం టికెట్లతో దర్శించుకున్నారు. వీఐపీల తాకిడి పెరగడంతో ముందు గేటు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయంలో రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా కొందరు ప్రైవేటు అర్చకులు ముందు ద్వారం గుండా భక్తులను తీసుకెళ్లడంతో క్యూలైన్లలో వేచి యున్న భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దసరా వచ్చిందయ్యా..

(1వ పేజీ తరువాయి)

పూజ చేయడం, పాలపిట్టను దర్శించుకోవడం ఈ పర్వదిన వేళ విశిష్టమైందని శాస్త్రాలు చెప్పిన క్రమంలో ప్రజలంతా వీటిని ఆచరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ పర్వదిన జోరు హోరు స్పష్టంగా కనపడుతుంది. ఈ సారి దసరా పర్వం గురువారంతోపాటు జాతిపిత మహాత్మా గాంధీ అయిన అక్టోబరు 2 కలిసి రావడంతో గురువారం రోజు మటన్ షాపులు దసరా వేళ మద్యపాన ప్రియులకు ఇష్టమైన వైన్ షాపులకు కూడా సెలవు కావడంతో ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారమే నగరంలోపాటు గ్రామీణ ప్రాంతాల్లో మద్యం షాపులు కిటకిటలాడాయి. గురువారం ఉదయం తెల్లవారుజాము 4 గంటలలోపే మటన్ అందించనున్నట్లు హనుమకొండ మటన్ మర్చంట్ అసోసియేషన్ వినియోగదారులకు ప్రకటన చేయడం గమనార్హం.

విజయదశమి వేళ

మహాభారత ఇతిహాసమున పాండవులు అజ్ఞాత సమయంలో విరాట్‌నగర పొలిమేరల్లో ఉన్న శమివృక్షం (జమ్మిచెట్టు)పై ఆయుధాలను భద్రపరిచారని, ఉత్తర గోగ్రహణ వేళ అర్జునుడు ఆ ధనుర్భాణాలను తీసుకొని కౌరవులపై పోరాడి గోవులను తిరిగి సంగ్రహించి విజయం పొందారని అందుకే విజయోత్సహంగా దసరా జరుపుకుంటున్నామన్నది ఒక ప్రతితీ. దీంతోపాటు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న దశకంఠుడైన రావణసూరిని మహిషాసుర మర్ధిని రూపంలో ఉన్న అమ్మవారు సంహరించిన వేళ చెడుపై మంచి సాధించిన గుర్తుగా దుష్టటని పీడ విరగడైందంటూ ఆనందంగా జరుపుకునే పర్వమే ఈ విజయదశమి అన్న నానుడి కూడా ప్రజల్లో ఉంది.

వివరములు	వడ్డీ రేట్లు	సీనియర్ సిటిజన్స్
1) సేవింగ్స్ డిపాజిట్లపై	3.00 %	3.00 %
2) ఫిక్స్‌డ్ డిపాజిట్లపై		
7 రోజుల నుండి 90 రోజుల వరకు	5.50%	6.00%
91 రోజుల నుండి 180 రోజుల వరకు	5.70%	6.20%
181 రోజుల నుండి 1 సం॥ వరకు	6.00%	6.50%
1 సం॥ పైబడి నుండి 3 సం॥ల వరకు	7.50%	8.00%
3 సం॥ పైబడి నుండి 10 సం॥ల వరకు	7.25%	7.75%





దసరా వచ్చిందయ్యా...

- నేడు విజయదశమి పర్వదినం
- సంబరాలకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- జబర్దస్త్ టీంచే సాంస్కృతిక కార్యక్రమాలు
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే
- భూపాలపల్లి అంబేద్కర్ క్రీడా మైదానంలో ఉత్సవాలు


జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో రావణవధకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు


దసరా ఉత్సవాలకు ముస్తాబవుతున్న పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానం

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): చెడుపై సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. ఈ పండుగను దేశ వ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. అలాగే రావణవధ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జిల్లా ప్రజలు దసరా పండుగను గురువారం జరుపుకోనున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జబర్దస్త్ టీం సభ్యులు ప్రజలను అలరించనున్నారు. మునిసిపాలిటీ,సింగరేణి అధికారులు ఈ ఏర్పాట్లు చేస్తున్నారు.

రావణవధ కార్యక్రమానికి ఏర్పాట్లు

దసరా ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో రావణవధకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణ ప్రజలను అలరించేందుకు సాంస్కృతిక కార్యక్రమాతో పాటు.. బాణ సంచా పేల్చి సంబురాలు జరుపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హాజరుకానున్న ఎమ్మెల్యే..

దసరా ఉత్సవాలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. వీవీఐపీ, వీఐపీ, సాధారణ ప్రజలు కూర్చునేందుకు సీట్లు ఏర్పాటు చేశారు. భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా, చెడుపై మంచి గెలిచే విధంగా ఈ పండుగను జరిపేందుకు ప్రజలు సిద్ధం కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. దుర్గామాత దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరారు.

కట్టడి జరిగేనా.!?
నేడు గాంధీ జయంతి.. దసరా - 6లో







ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు


దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించే శక్తి ప్రభుత్వానికి ఇవ్వాలని దుర్గామాతను వేడుకున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం రాత్రి మండలంలో పర్యటించి ధన్వాడ దత్తాత్రేయ స్వామి ఆలయం, గారెపల్లి, ఎర్రగుంటపల్లిలో నెలకొల్పిన దుర్గామాతల వద్ద మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు పాడిపంటలు, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ నేత రాజ్‌కుమార్ నూతన బైక్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ఎర్రగుంటపల్లి నుంచి గారెపల్లి వరకు నడిపారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాపు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు సుగుణ, మండల అధ్యక్షురాలు మహేశ్వరి, డీసీసీ ప్రధాన కార్యదర్శి స్వప్న, డీసీసీ ఉపాధ్యక్షుడు సమ్మిరెడ్డి, నాయకులు మల్లయ్య, దేవేందర్‌రెడ్డి, రాజేశం, శ్రీహరి, రాజు, రమేష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, మహేందర్, సత్యం, శ్రీశైలం, ఆర్యవైశ్య సంఘం నేతలు నవీన్, చంద్రమౌళి, శ్రీనివాస్, మూర్తి, రమేష్ బాబు, మనోహర్, నగేష్, కిరణ్, రవీందర్, ప్రకాష్, శ్రీమన్ పాల్గొన్నారు.

భారీగా తగ్గిన బొగ్గు ఉత్పత్తి

గత నెలలో 54 శాతమే వెలికితీత

కృష్ణకాలనీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి సగానికి తగ్గిపోయింది. నిర్దేశించిన లక్ష్యానికి ఆమడ దూరంలో నిలిచిపోయింది. ఈ మేరకు బుధవారం గత సెప్టెంబరులో సింగరేణి ఏరియాలోని రెండు ఓసీలు, నాలుగు భూగర్భ గనుల్లో సాధించిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతను ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి ప్రకటించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 3.178 లక్షల టన్నులు కాగా.. కేవలం 1.71 లక్షల టన్నులు మాత్రమే సాధించి 54 శాతానికి పరిమితం అయ్యారు. అలాగే బొగ్గు రవాణా లక్ష్యం 3.178 లక్షల టన్నులు కాగా.. 1.75 లక్షల టన్నులను మాత్రమే చేసి 55 శాతంతో సరిపెట్టుకున్నారు. అలాగే ఓసీ-2, ఓసీ-3లో కలిపి ఓబీ 1,10,000 క్యూబిక్ మీటర్ల లక్ష్యం కాగా.. కేవలం 43,921 మాత్రమే చేశారు. అతి తక్కువగా కేటీకే 5 ఇంక్లైన్‌లో 25,600 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా.. కేవలం 8,983 టన్నులు సాధించి అత్యల్పంగా 35 శాతానికి నిలిచిపోయారు. కాస్త మెరుగ్గా కేటీకే 1వ గనిలో 21,300 టన్నులు కాగా.. 14,570 సాధించి 68 శాతం బొగ్గు వెలికి తీయగలిగారు. కాగా, ఈ అక్టోబరు మాసానికి 4.234 లక్షల టన్నుల వెలికితీత లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి
- బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి
- ములుగు జిల్లా అభివృద్ధి దిశగా పయనిస్తోంది
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క


మండల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం ఏటూరునాగారం మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సంఘం ఇచ్చిన రిజర్వేషన్లపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరాధార నిందలు వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు నిత్యం అసత్య ప్రచారాలు చేస్తూ విషం కక్కుతున్నారని సీతక్క మండిపడ్డారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఏటూరునాగారం మండలానికి బస్సు డిపో, సెంట్రల్ లైటింగ్, అగ్నిమాపక భవనం మంజూరు చేశామని, గ్రామ గ్రామాన సీసీ రోడ్లు, ముస్లిం కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కోసం వేల కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు.

మేడారం అభివృద్ధికి రూ.150 కోట్లు, కొండాయి బ్రిడ్జికి రూ.16 కోట్లు మంజూరు చేశామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులు, 50వేలకు పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉచిత బస్సు సౌకర్యం, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలు అమలు చేస్తునట్లు తెలిపారు. ఇటీవల డీఎస్పీగా నియమితులైన ఏటూరునాగారానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌ను మంత్రి అభినందించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ జిల్లా అభివృద్ధి దిశగా పరుగెత్తుతోందని సీతక్క స్పష్టం చేశారు. ధనిక రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. గత ప్రభుత్వం హామీలు ప్రజలకు ఇప్పటికీ బాకీ పడిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్యతో పాటు రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, యువజన, మహిళా నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- ఐకమత్యంతో పనిచేస్తే విజయం తథ్యం
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు


కాంగ్రెస్ బాకీ కార్డులను చూపిస్తున్న లక్ష్మణ్‌బాబు, నాయకులు

ఏటూరునాగారం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు(లక్ష్మణ్‌బాబు) అన్నారు. బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రంలో మండల పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు ఐకమత్యంగా పనిచేస్తే బీఆర్ఎస్ విజయం తథ్యమని తెలిపారు. కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేయలేని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. అసమర్థ కాంగ్రెస్ పాలనలో రైతులకు, మహిళలకు, నిరుద్యోగులకు, సబ్బండ వర్గాలకు అన్యాయం జరుగుతోందని, ఈ పాలన పట్ల ప్రజలు విసుగు చెందారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గద్దెనెక్కడానికి కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల మోసాన్ని, 420 హామీలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని అన్నారు.

రాబోయే రోజుల్లో కేసీఆర్ పాలన తిరిగి రావాలంటే ఈ స్థానిక ఎన్నికలే పునాదులు వేస్తాయని ఆయన పేర్కొన్నారు. అధికారం సాధించాలని గ్రామాల్లో కులమతాల మధ్య చిచ్చు పెడుతూ, అభ్యర్థులను భయపెడుతున్న వారి బెదిరింపులకు కార్యకర్తలు భయపడొద్దని, ప్రతీ కార్యకర్తకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టడానికి సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ బాకీ కార్డులను పార్టీ నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, మంగపేట మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, తాటి కృష్ణ, తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘుతో పాటు ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- జిల్లాలో రెండు విడతలుగా ఎన్నికలు
- కోర్టు ఆదేశాల మేరకు మంగపేట మండలంలో ఎన్నికల నిలిపివేత
- ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ టీఎస్.దివాకర తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ దివాకర మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను రెండు విడతలుగా, గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ షెడ్యూల్ విడుదల చేశారని అన్నారు. అదే ప్రకారం ములుగు జిల్లాలో ఎన్నికలు జరుగుతాయని, జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున గ్రామీణ ప్రాంతాల్లో ఎంసీసీ కోడ్ అమలవుతుందని తెలిపారు. జిల్లాలోని 9 మండలాల్లో గల 146 గ్రామ పంచాయతీలు, 1,290 వార్డులు, 87 షెడ్యూల్డ్ ప్రాంత గ్రామ పంచాయతీలు, 59 నాన్ షెడ్యూల్డ్ ప్రాంత గ్రామ పంచాయతీలు, జిల్లావ్యాప్తంగా 1,306 గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్లు, 217 పోలింగ్ లోకేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంసీసీ కోడ్ అమలులో భాగంగా 11 ఎఫ్ఎస్‌టీ, 6 ఎస్ఎస్‌టీ టీములను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 10 జడ్పీటీసీ స్థానాలకు 03 ఎస్టీ, 04 ఎస్సీ, ఒక బీసీ, ఒక అన్ రిజర్వ్ క్యాటగిరి కేటాయించామని చెప్పారు. 69 ఎంపీటీసీ స్థానాల్లో 22 ఎస్టీ, 06 ఎస్సీ, 22 బీసీ, 19 అన్ రిజర్వ్ క్యాటగిరి కేటాయించామని, 09 ఎంపీపీ స్థానాల్లో 04 ఎస్టీ, ఒక ఎస్సీ, 03 బీసీ, ఒక అన్ రిజర్వ్ క్యాటగిరిలో కేటాయించామని పేర్కొన్నారు. జూలై 10 వరకు నమోదైన ఓటర్ల వివరాల ప్రకారం పురుషులు 1,10,838, మహిళలు 1,18,299, ఇతరులు 22 మంది కలిసి మొత్తం 2,29,159 మంది ఓటువేసే అవకాశం ఉందని తెలిపారు.

ప్రతి విడతలో గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌కు అనుగుణంగా నామినేషన్ పరిశీలన, పోలింగ్ తేదీలు నిర్ణయించామని కలెక్టర్ దివాకర తెలిపారు. పోలింగ్ కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులు ఉన్నాయో లేదో చెక్ చేస్తున్నారని, పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయిస్తామని అన్నారు. మండల కేంద్రాల్లో నామినేషన్ స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. స్క్రూటినీ చేసిన తరువాత అప్పీల్‌కు అవకాశం కల్పించి డిస్పోజల్ కోసం ఒకరోజు కేటాయించడం జరిగిందని, సోమవారం నుంచి ఎంసీసీ అమలులోకి రావడం జరిగిందని అన్నారు. ఎన్నికల నియమావళి తప్పకుండా పాటించాలని, పోలీసు బందోబస్తు కూడా తగినంతగా ఉన్నదని, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని కలెక్టరేట్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే విధంగా కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ఎన్నికల నిర్వహణపై ఎవరైనా ఫిర్యాదు చేయాలన్న పక్షంలో టోల్‌ఫ్రీ నంబర్ 18004257109కి ఫోన్ చేయాలని సూచించారు. ఓటర్లను భయాందోళనకు గురిచేస్తే చర్యలు తప్పవని, పక్షపాతం లేకుండా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్, డీపీవో దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పద్మాక్షి కాలనీలో నేడు రావణ వధ



హనుమకొండ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రసిద్ధ పద్మాక్షి ఆలయ ప్రాంగణంలో రావణసుర వధకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు రావణసుర వధ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ నేత రావుల సుదర్శన్ చెప్పారు. ఈసారి 36 అడుగుల ఎత్తుగల దశకంఠుడి కాశిబుగ్గకు చెందిన బాంబుల కుమార్‌చే ప్రత్యేకంగా తయారు చేయించామన్నారు. ఉపాధ్యక్షులుగా చీకటి ప్రకాశ్, పూలగంధం రాజారాం, సాంబరాజు రాజ్‌కుమార్, తోట పవన్, పులి రజనీకాంత్, కనుకుంట్ల రవికుమార్, రావుల్‌కార్ అనిల్‌తోపాటు కోమల కిషన్, తోట వెంకన్న, పోతుల శ్రీమాన్‌లు సభ్యులుగా కార్యక్రమాలను మూడున్నర దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు.

హనుమకొండలోని వస్త్రవ్యాపారి, మహేంద్రకపూర్ విగ్రహదాతగా వ్యవహరించారని సుదర్శన్ చెప్పారు. దసరా పర్వదిన వేళ కనీసం 50 వేల నగరవాసుల సమక్షంలో రంగురంగుల బాంబుల మధ్య దశకంఠుడి ప్రతిమను దహనం చేయడం ఆకట్టుకుంటుందని తెలిపారు. స్థానిక శాసనసభ్యుడు నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, రావు పద్మ, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. దసరా సందేశాలు, ప్రత్యేక కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, రావణసుర వధ ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరికీ జమ్మి ఆకు పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. నగరపాలక సంస్థ దసరా పర్వదిన వేళ పద్మాక్షి ఆలయానికి చేరుకునే భక్తుల కోసం ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడమేకాక రహదారులను మరమ్మతులు చేయించింది. ప్రత్యేక శానిటేషన్ సిబ్బంది సైతం ఏర్పాటు చేసింది.

నేడు మాంసం షాపులు తెరవొద్దు

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో గురువారం గాంధీ జయంతి సందర్భంగా అన్ని మాంసాహార సంస్థలు మూసివేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వ్యాపారులు, మాంసాహార దుకాణాల యజమానులు, విక్రయదారులు, మార్కెట్ నిర్వాహకులు సహకరించి షాపులు మూసివేయాలని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించి ఎక్కడైనా మాంసం, చికెన్ విక్రయాలు నిర్వహిస్తే మునిసిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాంసం విక్రయాలు జరిపినట్టు కనిపిస్తే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అదే విధంగా షాపులలో కాకుండా ఎక్కడైనా జంతువధ జరిపితే చర్యలు తప్పవని కమిషనర్ తెలిపారు. మాంసం నియంత్రణ కోసం నగరంలో ప్రత్యేక బృందాలు నగరంలో అన్ని చోట్ల నిఘా పెట్టినట్టు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి వెల్లడించారు.

అదిగో అంగ'రంగలీల'

- అంబరాన్ని తాకనున్న దసరా సంబరాలు
- 70 అడుగుల ఎత్తైన రావణ ప్రతిమ దహనానికి సర్వం సిద్ధం
- హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ, పలువురు ప్రముఖులు
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- 88 ఏళ్లుగా కొనసాగుతున్న దసరా వేడుకలు



ఉర్సు గుట్ట వద్ద ఏర్పాటు చేసిన రావణ ప్రతిమ (ఫైల్)



రంగలీల మైదానంలో చేస్తున్న దసరా ఉత్సవ ఏర్పాట్లు

కరీమాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉర్సు గుట్ట రంగలీల మైదానం దసరా సంబరాలకు సిద్ధమైంది. విజయదశమి రోజున (గురువారం) ఘనంగా నిర్వహించే ఈ వేడుకలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. మరో వైపు దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కూడా ఏర్పాట్లు చేశారు. సుమారు 70 అడుగుల ఎత్తైన రావణ ప్రతిమను బాణసంచాతో దహనం చేస్తారు. ప్రత్యేక ఆకర్షణగా లేజర్ లైట్ షో, బాణసంచా మెరుపులు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట, పాటలు ప్రజలను అలరించనున్నాయి. వేడుకల్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరానున్నారు.

ఉత్సవాల్లో తొలుత కరీమాబాద్ రామస్వామి దేవాలయం నుంచి రథంలో శ్రీసీతారామచంద్రస్వామి, లక్ష్మణ సహిత, హనుమాన్ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి, ఊరేగింపుగా ఉర్సు గుట్ట రంగలీల మైదానానికి తరలిస్తారు. రథం వస్తున్న సమయంలో జై శ్రీరాం, జై హనుమాన్ అంటూ ప్రజలు శ్రీరామనామస్మరణ చేస్తారు. ఇక ఉత్సవాల్లో పలు కార్యక్రమాలు ప్రజలను అలరిస్తాయి. కళాకారుల నృత్య ప్రదర్శనలు, ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, మిరుమిట్లు గొలిపే ప్రత్యేక బాణసంచా మెరుపులు ఆకట్టుకుంటాయి. ఈ వేడుకలు సాయంత్రం 7గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు కొనసాగుతాయి.

హాజరు కానున్న పలువురు ప్రముఖులు

దసరా వేడుకలకు ముఖ్య అతిథులుగా పలువురు రాజకీయ నాయకులు, అధికారులు హాజరుకానున్నారు. అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మేయర్ గుండు సుధారాణి, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కలెక్టర్ సత్య శారద, సీపీ సన్‌ప్రీత్ సింగ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ సలీమా, 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ఏఎస్పీ శుభం ప్రకాష్, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు గోపాల నవీన్‌రాజు, పలువురు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులతో పాటు, స్థానిక కార్పొరేటర్లు తదితరులు హాజరవుతారు.

8 దశాబ్దాల చరిత్ర

ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు 87 ఏళ్ల చరిత్ర ఉంది. నాడు ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో 2 వేల మందితో ప్రారంభమైన ఉత్సవాలు నేడు లక్షలాది జనాలను రప్పించే స్థాయికి ఎదిగాయి. తొలినాళ్లలో దసరా ఉత్సవాలలో ఉర్సు గుట్టపై రావణుడి పటాన్ని తగిలించేవారు. కరీమాబాద్ రామస్వామి దేవాలయం నుంచి రథంపై సీతారామ, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలతో రథయాత్ర ఊరేగింపుగా సాగుతూ, చిడతల రామాయణం, కోలాటాలు, భజనల మధ్య నృత్యాలు చేసుకుంటూ మైదానానికి చేరుకునేవారు. ఆకాశంలో పాలపిట్ట, గరుత్మంతుడి దర్శనానంతరం వీక్షకులు చప్పట్లతో సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యేవారు. అప్పటికే గుర్రంపై వచ్చిన వ్యక్తి లైసెన్స్ కలిగిన తుపాకితో గుండుకు కట్టిన రావణుడి పటాన్ని పేల్చేవాడు. దీంతో రావణుడి పటం చెల్లాచెదురుగా పడిపోవడంతో ప్రజలు ఆ పటం ముక్కలను స్నేహితులకు, బంధువులకు, ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుకునే వారు. తల్లిదండ్రులకు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకునేవారు. పటం సంస్కృతిని కరీమాబాద్ ప్రాంతానికి చెందిన గంజి పంచయ్య 40 ఏళ్లపాటు కొనసాగించాడు. 1967లో దసరా ఉత్సవ కమిటీ ఏర్పడింది. వ్యవస్థాపక అధ్యక్షుడిగా మార్గం శంకర్ 30 ఏళ్లు కొనసాగారు. తరువాత వద్నాల చంద్రమౌళి 4 సంవత్సరాలు, నాగపూరి వెంకటస్వామి 18 ఏళ్లు బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం నాగపూరి సంజయ్‌బాబు అధ్యక్షుడిగా ఉన్నారు.

పార్కింగ్ ప్రదేశాలు....

దసరా వేడుకలను తిలకించేందుకు వచ్చే వాహనాలను పార్కింగ్ చేసేందుకు దసరా ఉత్సవ కమిటీ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఉర్సు గుట్ట సమీపంలో పలు పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశారు. హన్మకొండ నుంచి వచ్చే వాహనాలు జేఎస్ఎం పాఠశాల వద్ద, నాయుడు పెట్రోల్‌పంపు నుంచి వచ్చే వాహనాలను తాళ్ల పద్మావతి కళాశాల వద్ద, వరంగల్ నుంచి వచ్చే వాహనాలను బీరన్నగుడి ప్రదేశాల్లో పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

వరంగల్ క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఉర్సు రంగలీల మైదానంలో దసరా ఉత్సవాల నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 3వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ట్రైసిటీ పరిధిలో వాహనాలు మళ్లిస్తున్నట్లు సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు.

- ఖమ్మం నుంచి వరంగల్ మీదుగా కరీంనగర్, హైదరాబాద్ వెళ్లే వాహనాలు పున్నేలు క్రాస్, ఐనవోలు ఆర్చ్, వెంకటాపురం, కరుణాపురంగా మీదుగా వెళ్లాలి.
- కరీంనగర్ నుంచి ఖమ్మం వెళ్లాల్సిన వాహనాలు కొత్తపేట, ఏనుమాముల, లేబర్‌కాలనీ, తెలంగాణ జంక్షన్, ఫోర్ట్‌రోడ్డు మీదుగా వెళ్లాలి.
- హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లాల్సిన వాహనాలు కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు, పున్నేలు నుంచి వెళ్లాలి.

ఉత్సవాలకు వచ్చే వాహనాలకు పార్కింగ్

- హనుమకొండ హంటర్‌రోడ్డు నుంచి ఉర్సు గుట్ట వచ్చే వాహనాలు కొలంబో ఆస్పత్రి, బీఆర్‌నగర్ ఎదురుగా గానుగ ఆయిల్ పాయింట్, ఆకుతోట కన్వెన్షన్ హాల్, నాని గార్డెన్, జేఎస్ఎం స్కూల్‌లో పార్కింగ్ చేయాలి.
- కడిపికొండ నుంచి వచ్చే వాహనాలను భారత్‌పెట్రోల్ పంపు దగ్గర పార్కింగ్ చేయాలి.
- ఆర్‌టీవో జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు లక్ష్మీ ఫంక్షన్‌హాల్ మైదానం, తాళ్ల పద్మావతి కళాశాల దగ్గర పార్కింగ్ చేయాలి.
- కరీమాబాద్ నుంచి వచ్చే వాహనాలు బీరన్న గుడి దగ్గర పార్కింగ్ చేయాలి.

మటన్ ముక్క.. మందు సుక్క..

- గ్రామాల్లో దసరా పండుగ జోష్ ● పెద్ద ఎత్తున గొర్రెలు, మేకల కొనుగోళ్లు
- కలిసివచ్చిన స్థానిక ఎన్నికల వాతావరణం ● ఆశావహుల ఇళ్లల్లో మద్యం డంపులు

లింగాలఘణపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి. దీనినే దసరా పండుగగా జరుపుకుంటారు. ఈ పర్వదినం సకల శుభాలకు జయాలను ప్రసాదిస్తూ జనహృదయాల్లో ఉత్సాహాన్ని నింపే ప్రత్యేక పండుగ. ఈ పండుగ రోజున శమీ (జమ్మి)వృక్షానికి పూజలు చేసి, పాలపిట్టను దర్శనం చేసుకుంటే ఏడాది పొడవునా శుభాలు కలుగుతాయని నమ్మకం. ఉద్యోగ రీత్యా, బతుకుదెరువు కోసం స్వగ్రామాలను వదిలి పట్నం వెళ్లిన వారంతా రెండు రోజులుగా ఊళ్లకు చేరుకుంటున్నారు. మందు సుక్క.. మటన్ ముక్క దసరా ప్రత్యేకత.. ఎంతటి పేదవాళ్లయినా సరే కొత్తదుస్తులను ధరించి తమ శక్తిసామర్థ్యాల మేరకు పండుగను నిర్వహించుకుంటారు.

జమ్మిచెట్టు వద్ద పూజలు నిర్వహించిన అనంతరం జమ్మి ఆకును పంచుతూ అలాయ్‌బలాయ్ తీసుకుంటారు. అంతే కాదు.. తమ రక్తసంబధీకుల కుటుంబాలకు చేరుకుని పెద్దల చేతికి జమ్మి అందించి పాదనమస్కారాలతో ఆశీస్సులను అందుకుంటారు. ఏడాది పొడవునా బంధుమిత్రుల నడుమ అక్కడక్కడ చిన్నా చితక గొడవలు ఏమైనా ఉంటే దసరా పండుగ రోజున వాటిని పటాపంచలు చేసి ఆత్మీయ ఆలింగనాలతో ప్రేమను పంచుకుంటారు.

వాహనపూజలు.. విందు భోజనాలు..

దసరా పండుగ రోజున ప్రతీ ఒక్కరు తమ గ్రామంలోని దేవాలయాలకు వెళ్లి ప్రత్యేకపూజలను చేసుకుంటారు. వాహనపూజలు చేయడం కడాఆ ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం వాహనాలను శుభ్రంగా కడిగి పూలతో అలంకరించి పూజలు చేస్తారు. అనంతరం బంధుమిత్రుల కోసం పెద్ద ఎత్తున విందుభోజనాలను ఏర్పాటు చేసుకోవడం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ. ఆత్మీయులను దసరా పండుగ సందర్భంగా ఇంటికి ఆహ్వానించి భోజనం పెట్టేందుకు గొర్రెలను, మేకలను పెద్దఎత్తున కోసి మాంసాహార విందు చేస్తారు. ఇందుకోసం వారం రోజులుగా గొర్రెలు, మేకల కొనుగోళ్లు పెద్ద ఎత్తున చేపట్టారు.

పాలపిట్ట దర్శనమయ్యేనా..

పూర్వపు రోజులతో పోల్చుకుంటే అభివృద్ధిపేరిట జరుగుతున్న విధ్వంసాలు అనేక పక్షిజాతుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇప్పటికే తాతముత్తాతలు పరిచయం చేసిన వేలాది పక్షిజాతులు కనుమరుగైపోయాయి. వాటి బాటలోనే ఇప్పుడు పాలపిట్టలు కూడా కనిపించకుండా పోతున్నాయి. తరతరాలుగా వస్తున్న సంప్రదాయంలో భాగంగా గ్రామాల్లో ఉన్న గడీల వద్ద దసరా పూజలు చేసిన అనంతరం సొరకాయను పెద్ద కత్తితో నరికి పూజలకు శ్రీకారం చుడుతారు. అనంతరం జమ్మివృక్షం వద్ద పూజలు చేసి జొన్నచేలు, ఇతర ఆహారధాన్యాల పంటలపై వాలే పాలపిట్ట దర్శనం కోసం పంట పొలాలవైపు పరుగులు తీస్తారు. కొన్నేళ్లుగా అక్కడ పాలపిట్ట కంటికి కనిపించడం గగనమైపోతోంది.

ముందస్తుగానే మద్యం కొనుగోళ్లు..

దసరా అంటేనే మద్యం ఏరులై పారడం.. సాధారణ పండుగలకంటే ఒకట్రెండు పెగ్గులు అదనంగా వేయడం.. ఈ పండుగ ప్రత్యేకత.. సరిగ్గా ఇలాంటి పండుగనాడే గాంధీ జయంతి రావడంతో ఊరూరా మద్యం కొనుగోళ్లు రెండు మూడురోజుల ముందు నుంచే షురూ అయ్యాయి. గాంధీ జయంతి సందర్భంగా మద్యం షాపులు మూసేస్తారని ప్రతీ ఒక్కరూ అవసరానికి మించి మద్యం బాటిళ్లను కొనుగోలు చేసుకుని ఇళ్లల్లో భద్రపర్చుకున్నారు. గాంధీ జయంతి నాడు జీవహింస చేయరాదనే నిబంధనతో ఊళ్లల్లో బుధవారం రాత్రి నుంచే యాటలను బలిచ్చే పనిలో నిమగ్నమై పోయారు.



ఊళ్లల్లో ముందస్తు దసరా జోరు..

అన్ని దసరా పండుగలతో పోల్చుకుంటే ఈ సారి దసరా పండుగ కొత్త కిక్కును తెచ్చిపెట్టింది. రెండేళ్లుగా ఎదురు చూస్తున్న స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఆశావహులు పోటాపోటీగా దసరా వేడుకలను ముందస్తుగానే నిర్వహిస్తున్నారు. తమ అనుచరగణంతో గ్రామస్థులను పోగు చేసి వ్యవసాయ బావుల వద్ద, దాబాలు, రెస్టారెంట్ల వద్ద ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి దసరా దావత్‌లు ఇస్తుండటం గమనార్హం. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఆశావహులు అడ్వాన్స్‌గా తమకు అవసరమైన మద్యాన్ని పెద్దమొత్తంలో కొనుగోలు చేసుకుని ఇళ్లల్లో డంపులుగా భద్రపర్చుకుంటున్నారు. పట్టణప్రాంతాలకు వలసవెళ్లిన కుటుంబాలు పండుగ నిమిత్తం స్వగ్రామాలకు చేరుకుంటుండంతో వచ్చిన వాళ్లను వచ్చినట్టుగా తమ బుట్టలో వేసుకునేందుకు ఆశావహులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అప్పుడే ఇళ్లచుట్టూ తిరుగుతూ మంచి చెడులను అడిగి రానున్న ఎన్నికల్లో తాను సర్పంచ్‌గా పోటీ చేస్తున్నాని ఓట్లన్నీ గంపగుత్తగా తనకే వేయాలని మచ్చిక చేసుకునే పనిలో ఆశావహులు నిమగ్నమపోతున్నారు.

నేడు కేసముద్రం పోలీస్ సర్కిల్ ప్రారంభం

- ఇనుగుర్తి పోలీస్‌స్టేషన్ కూడా



కేసముద్రం సీఐ కార్యాలయం ఏర్పాటు చేయబోతున్న పోలీస్‌స్టేషన్

కేసముద్రం/ఇనుగుర్తి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం పోలీస్ సర్కిల్, ఇనుగుర్తి పోలీస్‌స్టేషన్‌ను గురువారం ప్రారంభించనున్నట్లు పోలీసు అధికారులు బుధవారం తెలిపారు. కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లోనే సీఐ ఛాంబర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో డీసీఆర్‌బీ, ఎస్‌బీ విభాగంలో సీఐగా పనిచేస్తున్న సత్యనారాయణను కేసముద్రం సీఐగా నియమించినట్లు తెలిసింది. ఇనుగుర్తిలో సొసైటీ ఎరువుల విక్రయ కేంద్రం సమీపంలోని ప్రైవేటు భవనంలో నూతన పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్నారు. ఈ పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌చార్జి ఎస్ఐగా కేసముద్రం ఎస్ఐ-2 జి.కరుణాకర్‌ను కేటాయించినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిచాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు నియమించిన జోనల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంబంధిత అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఫర్నిచర్, టాయిలెట్, లైటింగ్, వెబ్‌కాస్టింగ్ తదితర కనీస సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. జోనల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు సమన్వయంతో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని, పోలింగ్ తేదీకి ఒక రోజు ముందే సిబ్బంది అక్కడ ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు.

వర్ధన్నపేట మండలంలోని శివరాంపూర్ వద్ద, పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండ వద్ద, జాన్‌పీరీలు తదితర ఐదు సరిహద్దు ప్రాంతాల్లో స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, అదే విధంగా ప్రతీ మండలానికి ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణం కల్పించడం ప్రధాన బాధ్యత అని కలెక్టర్ గుర్తు చేశారు. అన్ని శాఖలు సమన్వయం చేసుకొని జిల్లాలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీపీవో కల్పన, డీబీసీడీవో పుష్పలత, డిప్యూటీ సీఈవో వసుమతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

నేడు భద్రకాళి మహాదర్శనం

- చక్రస్నానం, అమ్మవారికి పట్టాభిషేకం ● సాయంత్రం జల క్రీడోత్సవం
- దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు, వసతుల ఏర్పాటు


వరంగల్ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): భక్తకోటి ఇలవేల్పు భద్రకాళి అమ్మవారు గురువారం నిజ రూపంలో దర్శనమిస్తారు. దసరా రోజున అమ్మవారిని దర్శించుకుంటే అన్ని విజయాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఉదయం 5 గంటల నుంచి భక్తులకు మహాదర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం 3 గంటలకే నిత్యపూజ నిర్వహించి అపరాజిత పూజ, ఆయుధ పూజ, శమీ పూజ, చక్రస్నానం, సామ్రాజ్య పట్టాభిషేకం, చూర్ణోత్సవం, ధ్వజారోహణం నిర్వహిస్తామని ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. సాయంత్రం అమ్మవారికి జల క్రీడోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రస్తుతం భద్రకాళి చెరువు ప్రాంగణంలో మాడవీధులు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో జల క్రీడోత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తారు. ఒక తాంబాలంలో నీరు పోసి ఒక పత్రం వేసి పేపరు పడవను తయారు చేసి అందులో గౌరమ్మను పేర్చి జల క్రీడోత్సవాన్ని నిర్వహిస్తామని శేషు తెలిపారు. దాదాపు 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని ఆలయ ఈవో తెలిపారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి వసతి ఏర్పాట్లు చేశామని, భద్రకాళి సేవా సమితి ఐతా గోపీనాథ్ ఆధ్వర్యంలో సేవా సమితి సభ్యులు 6 క్వింటాళ్ల ఆరు రకాల ప్రసాదాలను ఉచితంగా అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

అధిక డబ్బుల ఆశచూపి మోసం

- చైన్ సిస్టం పేరిట దగా చేస్తున్న ముఠా అరెస్టు ● వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అధిక డబ్బులు ఆశచూపి కోట్లు కొల్లగొట్టిన ముఠా సభ్యులను టాస్క్‌ఫోర్స్, పాలకుర్తి పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అలాగే నిందితుల నుంచి రూ.5 లక్షల 29 వేల నగదుతో పాటు 684.5 గ్రాముల బంగారు నాణాలు, 150 గ్రాముల బంగారు ఆభరణాలు, కారు, ల్యాప్‌టాప్, భూపత్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు.

జనగామ జిల్లా పాలకుర్తిలో నివాసం ఉంటున్న సూర్యాపేట జిల్లాకు చెందిన తెప్పాలి సైదులు (55), ఆంధ్రప్రదేశ్ నందిగామకు చెందిన మనబోతుల రామకృష్ణ, సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌కు చెందిన పొడిల సురేశ్‌కుమార్, హుజూర్‌నగర్‌కు చెందిన పొడిల శ్రీధర్ ముఠాగా ఏర్పడి 2023లో సైదులు భార్య నారాయణమ్మ పేరు మీద హెబ్సిబా అనే ఓ సంస్థను స్థాపించారు. అనంతరం 2024లో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అధిక లాభాల ఆశచూపి చిట్టీల వ్యాపారం ప్రారంభించారు. చిట్టీలో చేరే సభ్యులు రూ.6వేలు చెల్లిస్తే రూ.4వేలు తన దగ్గర డిపాజిట్ చేసుకొని రూ.2వేల విలువ చేసే బహుమతులు ఇస్తానంటూ నమ్మించి రూ.300 విలువైన వస్తువులను అందజేసేవారు. ఈ మేరకు చిట్టీలో చేరిన సభ్యుడికి 20నెలల పాటు నెలకు వెయ్యి చొప్పున అందజేసేవారు. అంతేకాక ప్రధాన నిందితుడు మిగతా నిందితులతో కలిసి గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని సుమారు 28,493 సభ్యత్వాలను నమోదు చేయించాడు. సభ్యుల నుంచి రూ.4వేల చొప్పున రూ.11కోట్ల 39 లక్షలను వసూలు చేశాడు. ఇదే కాకుండా రూ.2వేల విలువైన బహుమతులు అని చెప్పి కేవలం రూ.300 విలువైన బహుమతులు ఇవ్వడం ద్వారా రూ.4 కోట్ల 84 లక్షలు మోసం చేసినట్లుగా గుర్తించామన్నారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదు, వస్తువులు

కాగా, వీటికి సంబంధించిన మోసాలపై బాధితులు ప్రధాన నిందితుడు సైదులపై గతంలో మెదక్, సూర్యాపేట, జిల్లాలతో పాటు ఇల్లందు, ఎల్‌బీ నగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 10 కిపైగా చీటింగ్ కేసులు నమోదైనట్లు సీపీ వెల్లడించారు. దీంతో ప్రజలను మోసం చేసి 17 బ్యాంకుల్లో జమచేసిన రూ.5కోట్ల 48 లక్షల64 వేలకు సంబంధించిన లావాదేవీ ఖాతాలను నిలిపివేశామన్నారు. సమావేశంలో వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట, టాస్క్‌ఫోర్స్ ఏసీపీలు నర్సయ్య, మధుసూదన్, టాస్క్‌ఫోర్స్, పాలకుర్తి ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.





ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

• ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పక పాటిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలతోపాటు గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్‌రైటింగ్స్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24గంటల వ్యవధిలో తొలగించాలని, బస్టాండ్లు, పెట్రోల్ బంకులు, తదితర ప్రదేశాల్లో 48గంటల వ్యవధిలో, అనుమతిలేని ప్రైవేట్ స్థలాల్లో 72గంటల వ్యవధిలో పూర్తిస్థాయిలో తొలగించాలన్నారు. అక్టోబరు 9న నోటిఫికేషన్ వస్తుందని, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఫేజ్-1 ఎన్నికలకు సంబంధించి అక్టోబరు 9 నుంచి 11వ తేదీ ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. అక్టోబరు 23న మొదటి విడత పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఫేజ్-2 ఎన్నికలకు సంబంధించి అక్టోబరు 13 నుంచి 15వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, అక్టోబరు 27న రెండవ విడత పోలింగ్ జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. నవంబరు 11వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా గ్రామపంచాయతీ ఫేజ్-2 ఎన్నికలకు సంబంధించి అక్టోబరు 21 నుంచి 23వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, నవంబరు 4వ తేదీన మొదటి దశ పోలింగ్ జరుగుతుందని అన్నారు. గ్రామపంచాయతీ ఫేజ్-3 ఎన్నికలకు సంబంధించి అక్టోబరు 25 నుంచి 27వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, నవంబరు 8వ తేదీన రెండవ విడత పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. మొదటి, రెండవ విడతల్లోనూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం పోలింగ్ రోజునే మధ్యాహ్నం 2గంటల నుంచి కౌంటింగ్ జరిపి ఫలితాలు వెల్లడించడం జరుగుతుందని వివరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, డీఎస్పీ రవీందర్, డీపీవో దేవరాజ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

తగ్గుతున్న గోదావరి

మహదేవపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద బుధవారం గోదావరి నది తగ్గుముఖం పట్టింది. గత 50 రోజుల నుంచి వర్షాలతో అల్లకల్లోలం చేసిన గోదావరి వరద తగ్గుముఖం పడుతుండడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. అంతేగాకుండా మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత నది వరద తగ్గడంతో కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి 9.70 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.





ఆలయాల అభివృద్ధి కమిటీ ఎన్నిక

చిట్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చింతల్లపల్లిలో పలు దేవాలయాల అభివృద్ధి కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో గ్రామస్థులందరు సమావేశమై ఆంజనేయస్వామి ఆలయం, పోచమ్మ ఆలయం, పెద్దమ్మ ఆలయం, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శృంగారపు రంగాచారి, ప్రధాన కార్యదర్శిగా అల్లం తిరుపతి, ఉపాధ్యక్షులుగా పిట్టల రమేష్, గుర్ర రాజేందర్, ఓర్సు భద్రయ్య, కోశాధికారిగా సామల రమేష్, కార్యదర్శులుగా ముసాపూరి రవీందర్, చేర్ల చందు, తూముల సంజీవ్, గుండ ఉరేష్, చిలగాని నాగరాజు, సభ్యులుగా ర్యాకం రవీందర్, ఓర్సు శ్రీకాంత్, బుర్ర నరేష్, పిట్టల రాంచందర్, కోడెల రవీందర్, పెరుమాండ్ల రాజు, టేకు రవి, రాజు, సలహాదారులుగా చింతల రమేష్, ఆకుల రవీందర్, అల్లం రవీందర్, పిట్టల రాజమొగిలి, ఆకుల హరీష్, బుర్ర శ్రీధర్, కొక్కుల రాములు, కోడెల రాయమల్లు తదితరులు ఎన్నికయ్యారు.

ముగిసిన బతుకమ్మ సంబరాలు


మండలంలోని జగన్నాథపురంలో బతుకమ్మలతో మహిళలు

వాజేడు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సద్దుల బతుకమ్మ సంబరాలు బుధవారంతో ముగిసాయి. గుమ్మడిదొడ్డి, జగన్నాథపురంతో పాటు తదితర గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. బతుకమ్మ గద్దెల వద్ద మహిళలు, యువతులు ఆడిపాడారు. గిరిజన డోలు వాయిద్యాల చప్పుళ్లకు కాలు కదిపారు. గద్దెల చుట్టూ పదుల సంఖ్యలో మహిళలు బతుకమ్మ పాటలు పాడారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి గోదావరిలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

ముగిసిన విద్యార్థినుల వృత్తివిద్య శిక్షణ


బ్యూటీషియన్ శిక్షణ పొందిన విద్యార్థినులు

గోవిందరావుపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చల్వాయి మోడల్ పాఠశాల/కళాశాలలోని విద్యార్థినులకు సెప్టెంబరు 21న ప్రారంభమైన వృత్తివిద్య, బ్యూటీ అండ్ వెల్‌నెస్, హెల్త్‌కేర్ కోర్సుల శిక్షణ బుధవారం ముగిసింది. వృత్తివిద్య, బ్యూటీ అండ్ వెల్‌నెస్ కోర్సులో భాగంగా ఇంటర్న్‌షిప్ అవగాహన, క్లైంట్‌ను ఎలా రిసీవ్ చేసుకోవాలి, టూల్స్ క్లీనింగ్, పార్లర్ మెయింటనెన్స్ ఎలా ఉండాలి, వివిధ రకాలైన సర్వీసెస్‌పై ఒకేషనల్ కోఆర్డినేటర్లు అనిల్, సాంబశివరావు, సమగ్రశిక్ష అభియాన్ కోఆర్డినేటర్ రాజు, ట్రైనర్లు సౌజన్య, పావని, స్వాతి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడులు

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ నేపథ్యంలో అక్రమంగా నిర్వహిస్తున్న కోడిపందేల సెంటర్లపై పోలీసులు బుధవారం దాడులు చేశారు. మండలంలోని రాపల్లికోట, ఎన్కపల్లి శివార్లలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టి పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం బ్యారేజీలోకి 7.71 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం 8 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుంది.




బ్రాందీషాపులు, మటన్, చికెన్ సెంటర్లు మూసివేయాలి : ఎస్సై

గోవిందరావుపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గాంధీ జయంతి సందర్భంగా గురువారం మండలంలోని బ్రాందీషాపులు, మటన్, చికెన్ సెంటర్లను మూసివేయాలని పస్రా ఎస్సై కమలాకర్ బుధవారం ఒక ప్రకటనలో నిర్వాహకులకు సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా అన్ని గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, ఎవరైనా పట్టుబడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో దసరా పండుగ వేడుకలు జరుపుకోవాలని ఆయన కోరారు.

కబడ్డీ పోటీలను వీక్షించిన ఇంగ్లాండ్ దేశస్థుడు

వెంకటాపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీదేవిపేటలో దసరా క్రీడల్లో భాగంగా బుధవారం నిర్వహించిన కబడ్డీ పోటీలను ఇంగ్లాండ్ దేశానికి చెందిన నికోలస్ వీక్షించారు. అమరావతి విద్యాలయంలోని మైదానంలో జరిగిన ఫైనల్ పోటీల్లో పట్వారిపల్లి, నర్సింగాపురం గ్రామాల జట్లు పోటీ పడ్డాయి. ప్రథమ బహుమతి లక్ష్మీపురం జట్టు, ద్వితీయ బహుమతి నర్సింగాపూర్ జట్టు, తృతీయ బహుమతి బూర్గుపేట జట్టు గెలుచుకున్నాయి. నర్సింగాపూర్‌కు చెందిన మిత్రుడి ఇంటికి వచ్చిన నికోలస్ క్రీడల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని కబడ్డీ పోటీలు అద్భుతంగా జరిగాయని అన్నారు. కాగా, ఇంగ్లాండ్ దేశస్థుడు నికోలస్‌తో ఫొటోలు దిగేందుకు పలువురు పోటీ పడ్డారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నికోలస్





కాంగ్రెస్‌లో చేరిన నాయకులు



నాయకులకు కండువా వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి సీతక్క

కన్నాయిగూడెం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుట్టాయిగూడెం, ఐలాపురం తదితర గ్రామాలకు చెందిన 20 మంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏటూరునాగారంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క సమక్షంలో నాయకులు కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువాలను మెడలో వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండి.అప్సర్ పాషా, మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రావణాసుర వధ కార్యక్రమానికి ఏర్పాట్లు



జిల్లా కేంద్రంలో రావణాసుర వధ కోసం చేస్తున్న ఏర్పాట్లు

ములుగు టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలో ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో గురువారం జరగనున్న రావణాసుర వధ కార్యక్రమానికి ఏర్పాట్లు ప్రారంభించారు. గత 24 సంవత్సరాలుగా ఉత్సవ కమిటీ సభ్యులు దసరా పర్వదినాన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఎక్కువ సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ కాంతులతో, బాణసంచా పేలుళ్లతో జరగనున్న ఈ కార్యక్రమానికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

లంబాడీలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేయాలి

- ఆదివాసీ నవనిర్మాణసేన జిల్లా అధ్యక్షుడు కుంజ మహేష్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మహేష్

వెంకటాపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్డ్ ఏరియాలో లంబాడీలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేయాలని ఆదివాసీ నవనిర్మాణసేన జిల్లా అధ్యక్షుడు కుంజ మహేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలో జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ఆదివాసీలకు ఇళ్లు కేటాయించకుండా వలస గిరిజనేతరులు, లంబాడీలకు పెద్ద మొత్తంలో ఇళ్లు కేటాయించడం రాజ్యాంగ వ్యతిరేకమని, ఇది ఆదివాసీల హక్కులకు భంగం కలిగిస్తున్నదని అన్నారు. లంబాడీలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 సవరణ లేకుండా 149 జీవో ఆధారంగా ఎస్టీ హోదా పొందినట్లు ప్రకటించడం, వారికి అదనపు హక్కులు ఇవ్వడం ఆదివాసీల హక్కులను హరించడమేనని అన్నారు. మండలంలోని బీసీమగ్రిగూడెం ప్రాంతంలో కొందరు లంబాడీలు ఇళ్లు, భూములు కొనుగోలు చేశారని ఆరోపించారు. అదేవిధంగా గిరిజన ఉప ప్రణాళిక నిధులతో వలస గిరిజనేతరులు, లంబాడీలకు ఇళ్లు కేటాయించడం రాజకీయ ప్రయోజనాల కోసం జరుగుతున్న చర్యగా, స్థానిక ఎన్నికలకు తారసరూపంగా ఉపయోగపడుతున్నట్లు ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల పేరుతో గూడాల్లో ఆదివాసీల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తే వారికి సరైన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



వినయ్ (ఫైల్)

కాటారం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకుసాపూర్ వద్ద మంగళవారం రాత్రి బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడిన పంతకాని వినయ్(27) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి వినయ్‌తో పాటు గౌని నితీష్ అనే యువకుడు అంకుసాపూర్‌లో స్నేహితుడి జన్మదిన వేడుకలకు హాజరై వస్తుండగా రైస్‌మిల్లు సమీపంలో గుంత వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. తలకు తీవ్ర గాయాలైన వినయ్‌ను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. వినయ్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కాగా, మృతుడి తండ్రి సడువలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ వెల్లడించారు.

కట్టడి జరిగేనా.!?

- నేడు గాంధీ జయంతి.. దసరా
- 24 గంటలు మద్యం, మాంసం దుకాణాలు బంద్
- అమలులో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి
- గ్రామాల్లో ఇబ్బడి ముబ్బడిగా బెల్టు షాపులు
- ముందుగానే బెల్టు షాపులకు భారీగా తరలింపు





భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వైన్‌షాపు వద్ద మద్యం కొనుగోలుకు బారులుతీరిన జనం

కృష్ణకాలనీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా అంటేనే సుక్క.. ముక్క అనేది నాటి నుంచి వస్తున్న నానుడి. కానీ, గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి వచ్చిన దసరా మద్యం, మాంసం ప్రియులకు ఒకింత షాక్ ఇచ్చిందనే చెప్పుకోవచ్చు. అక్టోబరు 2న దసరా రావడం.. ఈ రోజే గాంధీ జయంతి ఉండటంతో మద్యం ప్రియులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం దుకాణాలన్నీ మూసివేయాలనే నిబంధన ఉంది. ప్రతీ యేటా అధికారులు చెప్పినా చెప్పకపోయినా మద్యం, మాంసం వ్యాపారులు వారి వారి కార్యకలాపాలను బంద్ చేస్తారు. ఈ తరుణంలో గురువారం జరగబోయే దసరా రోజున ఏళ్లుగా వస్తున్న నిబంధనలు అమలయ్యేనా, మద్యం, మాంసం విక్రయాలు కట్టడి జరిగేనా.. అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

24 గంటలు బంద్..

దసరా పర్వదినమైనప్పటికి గాంధీ జయంతికే అధిక ప్రాముఖ్యత ఉంటుంది. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాలు, చికెన్, మటన్, ఫిష్ దుకాణాల విక్రయాలు గురువారం రోజంతా 24 గంటలు బంద్ ఉండనున్నాయి. అయితే, మద్యం ప్రియులు మందును ముందుగానే కొనుగోలు చేశారు. బంద్ ఉంటుందని గమనించిన మద్యం ప్రియులు దసరా వేడుకలకు ఆటంకం లేకుండా ముందస్తు మద్యాన్ని కొనుగోలు చేసినట్లుగా తెలుస్తోంది. మరోవైపు మాంసం విక్రయాలు సైతం బంద్ ఉండనున్న దృష్ట్యా కొంత మంది ముందుగానే కొనుగోలు చేసుకుంటుండగా.. ఇంకొంత మంది వారివారి సమీప ఇళ్ల వారు స్వతహాగా మేకలు, గొర్రెలను కొనుగోలు చేసుకొని రహస్యంగా వాటిని వధించే ప్రయత్నంలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

అమలులో ఎన్నికల కోడ్..

స్థానిక సంస్థల షెడ్యూల్ విడుదలతో ఎన్నికల కోడ్ సైతం అమలులోకి వచ్చింది. ఈ కోడ్ ఒక్క భూపాలపల్లి మునిసిపాలిటీ మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో దాదాపు కోడ్ అమలులో ఉండనుంది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను గత నెల 29న ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో అప్పటి నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నెల 9న ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ సైతం జారీ కానుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఇప్పటి నుంచే పకడ్బందీగా అమలు చేయాలనే ఆదేశాలను ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియ చేశారు. అలాగే, వివిధ రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు సైతం వేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన చర్యలకై కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. కోడ్ అమలులో ఉన్నందున రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి అనుమతి లేదని, రాజకీయ పార్టీలు, ఆలయాలు, మసీదులు, చర్చీలు, ప్రార్థన స్థలాల్లో సైతం సమావేశాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించొద్దని ఇప్పటికే జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రకటించారు.

గల్లీగల్లీకో బెల్టుషాపు..

భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపు దుకాణాలు ఉన్నాయి. కొంత మంది నేరుగా బెల్టునే నడిపిస్తుండగా.. మరికొందరు కిరాణం షాపు మాటున జోరుగా బెల్టు విక్రయాలు సాగిస్తున్నారు. నేటి దసరాను పురస్కరించుకొని గాంధీ జయంతికి మద్యం దుకాణాలు బంద్ అనే విషయం తెలియడంతో గ్రామాల్లోని బెల్టుషాపులకు విచ్చలవిడిగా మద్యం దిగుమతి అయినట్లు సమాచారం. దీంతో పాటు ఆయా గ్రామాల్లోని బెల్టుషాపులకు సంబంధించి సిండికేట్ నుంచి పెద్ద ఎత్తున కావాల్సిన సరుకును సుమారు లక్షల్లో విలువ చేసే బీరు, లిక్కర్‌ను ఆయా షాపులకు దిగుమతిచేసినట్లు తెలిసింది. అయితే, గాంధీ జయంతికి మద్యం దుకాణాలు మూసి ఉన్నప్పటికి మద్యం దొరకదనే పరిస్థితి లేకుండా చిన్న బ్రాండ్ నుంచి మొదలు పేరున్న బ్రాండ్ అన్ని మందుబాబులకు కావాల్సినంత దొరుకుతుంటాయి. కాగా, గాంధీ జయంతి ఒక వైపు అయితే, స్థానిక ఎన్నికల కోడ్ నియమావళి మరో వైపు ఉంది. ఈ తరుణంలో అటు ఎక్సైజ్, పోలీస్ అధికారులు గానీ దృష్టి పెట్టి మద్యాన్ని, మాంసాన్ని కట్టడి చేస్తారా.. లేక మామూలుగా తీసుకొనే వదిలేస్తారా.. అనే చర్చ జోరందుకుంది. అధికారులు ఏ వైపుకు మొగ్గు చూపుతారో వేచి చూడాలి మరీ. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం సైతం ఈ వ్యవహారాలపై గట్టి నిఘానే ఉంచినట్లు తెలుస్తోంది.

పండుగ పూట విషాదం

- ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు
- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

కాటారం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ కోసం బంధువుల ఇంటికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తూ మరో 10 నిమిషాల్లో ఇంటికి చేరే క్రమంలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడగా, మరొకరు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ విషాద సంఘటన బుధవారం రాత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని మేడిపల్లి అటవీ ప్రాంతంలోని 353(సీ) జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తైనేని శ్రీనివాస్, తోట రాకేష్‌లు దగ్గరి బంధువులు. బుధవారం ఉదయం అంకుసాపూర్‌కు చెందిన వ్యక్తి కారును తీసుకుని దసరా పండుగ కోసం చుట్టాల ఇంటికి వెళ్లి రాత్రి కొత్తపల్లికి తిరిగి వస్తున్నారు. భూపాలపల్లి నుంచి చల్లపల్లికి చెందిన మహేందర్ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌ను ట్రాలీతో సహా పట్టుకుని ఇంటికి వస్తున్నాడు. మేడిపల్లి అటవీ ప్రాంతంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనకాల వేగంగా వస్తున్న కారు ఢీకొట్టగా ట్రాలీ టైర్లు ఊడిపడగా కారు ముందు భాగం ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో కారులో ముందు సీట్లో కూర్చున్న తైనేని శ్రీనివాస్(28) అక్కడికక్కడే మృతి చెందగా, కారు నడుపుతున్న రాకేష్‌కు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని వరంగల్‌కు రెఫర్ చేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై శ్రీనివాస్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.



కారులోనే మృతి చెందిన శ్రీను

అంగరంగ వైభవంగా నవరాత్రులు

- ఘనంగా పూర్ణాహుతి



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహదేవపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన శుభానందదేవి ఆలయంలో పది రోజుల పాటు దేవీ నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం నవదుర్గా రూపంలో శుభానందదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ అర్చకులు, వేద పండితులు నిత్యం ఉదయాన్నే అమ్మవారిని పూజించి భాజా భజంత్రీలు, మంగళవాయిద్యాల మధ్య పూజలు చేశారు. అనంతరం పదో రోజు బుధవారం మహానవమిని పురస్కరించుకుని చండీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యశ్యామలార్చన నిర్వహించారు. లలితార్చన సాయంత్రంవరకు నిర్వహించారు. కార్యక్రమంలో ఫణకంటి ఫణీంద్రశర్మ, వేద పండితులు వైకుంఠ పాండుతోపాటు గట్టు రాంశర్మ, సిబ్బంది, ఈవో మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాళేశ్వరం గ్రామానికి చెందిన గంధసిరి మధుసూదన్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ తొమ్మిది రోజులు నవరాత్రి ఉత్సవాలకు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భక్తులు కోరిన కోర్కెలు నెరవేర్చాలని, శ్రీ శుభానందదేవి, సరస్వతి అమ్మవారిని పూజించారు.

పోలీసులపై పుట్ట మధు గూండాయిజం

- కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా స్థాయి నేతల ఘాటు విమర్శ



అంబేద్కర్ కూడలిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కాటారం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి కోసం పోలీసులపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు రౌడీయిజం, గూండాయిజం చేస్తూ మంథని నియోజకవర్గంలో అశాంతి వాతావరణం సృష్టించాలని చూస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆంగోత్ సుగుణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, డీసీసీ ప్రధాన కార్యదర్శి కుంభం స్వప్న, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వొన్న వంశవర్ధన్, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరిలు ఆరోపించారు. బుధవారం కాటారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం కూడలిలో పుట్ట మధు పోలీసులు, మంత్రి శ్రీధర్‌బాబుపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి వారు మాట్లాడుతూ ఎస్సై నుంచి మొదలుకుని ఎస్పీ స్థాయి అధికారిని విమర్శించి భయపెట్టే ప్రయత్నం చేసిన పుట్ట మధుపై పోలీసు సంఘాలు ఏమి మాట్లాడకపోవడం సరికాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి ప్రతిపక్ష నేత రేవంత్‌రెడ్డి మాట్లాడిన వ్యాఖ్యలపై అప్పటి పోలీసులు, పోలీసు సంఘాలు కేసు నమోదు చేసిన విషయం మర్చిపోయారా.. అని ప్రశ్నించారు. కాటారంలో మంగళవారం పుట్ట మధు పోలీసులను కించపర్చే విధంగా మాట్లాడి నేరస్తులకు మద్దతుగా నిలిచి అశాంతిని రగిల్చేలా చేస్తే పోలీసులు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. పుట్ట మధుపై చర్యలకు ప్రజాస్వామికవాదులు, పోలీసు సంఘాలు, రాజ్యాంగ పరిరక్షకులు డిమాండ్ చేయాలని కోరారు. పుట్ట మధు, అతడి కుటుంబ సభ్యుల ప్రోద్బలంతో ఎన్నో హత్యలు జరిగాయని, లాయర్ వామన్‌రావు మరణ వాంగ్మూలమే దానికి నిదర్శనమని మండిపడ్డారు. నాడు కొందరు పోలీసులే పుట్ట మధును కాపాడితే ప్రస్తుతం పోలీసులపైనే గూండాయిజం చేయడం దుర్మార్గమైన చర్యగా దుయ్యబట్టారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు కేసులు నమోదు చేస్తారని, అలా ఓ కేసులో జోడు శ్రీనివాస్ అనే వ్యక్తిని అరెస్ట్ చేస్తే రాద్ధాంతం చేయడం తగదన్నారు. పోలీసు అధికారులపై నిరాధార ఆరోపణలు చేయడం చూస్తుంటే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా జరగకుండా చేయడమే పుట్ట మధు ఉద్దేశ్యంగా తెలుస్తోందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబులపై నిత్యం ఏదో రకంగా తలుచుకోకుంటే ఆయనకు పొద్దు గడవదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, నాయకులు బొడ్డు మల్లయ్య, తెప్పల దేవేందర్‌రెడ్డి, రాజేశం, శ్రీహరి, రాజు, విజయరాజు, రమేష్, మధు, మజీద్, విక్రమ్, సమ్మిరెడ్డి, మల్లయ్య, ఉంసింగ్, రాజమౌళి, ప్రభుదాస్, రాజబాపు, ప్రభాకర్, అలీం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శతాబ్ది విజయదశమి ఉత్సవం



సమావేశం నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

కాటారం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని అయ్యప్ప కల్యాణ మండపంలో బుధవారం ఆర్ఎస్ఎస్(రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) మహదేవపూర్ ఖండ ఆధ్వర్యంలో శతాబ్ది విజయదశమి ఉత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. 1925లో స్థాపించబడిన ఆర్ఎస్ఎస్‌కు వంద ఏళ్లు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని శతాబ్ది విజయదశమి ఉత్సవం చేపట్టారు. ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత గ్రామ వికాస్ ప్రముఖ్ సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ అన్నివర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఖండ కార్యవాహ గడ్డం శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు ప్రవీణ్, గౌరోజు సంతోష్, రవీ, రాజగోపాల్, భాస్కర్‌రెడ్డి, కవ్వాల శేఖర్, వెంకటస్వామి, సుమన్ పాల్గొన్నారు.

ఖాళీ ప్లేట్లతో కార్మికుల నిరసన

- ఐటీడీఏ ఎదుట 20వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె



ఐటీడీఏ ఎదుట ఖాళీ ప్లేట్లతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఏటూరునాగారం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న దినసరి కార్మికుల నిరవధిక సమ్మె 20వ రోజుకు చేరుకుంది. సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న కార్మికులు ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట బుధవారం ఖాళీ ప్లేట్లతో వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.దావూద్, జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 20 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. కార్మికుల ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణమే యూనియన్ నాయకులతో చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. గత 8 నెలల నుంచి వేతనాలు లేక కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు వస్తున్న వేతనాలను తగ్గిస్తూ తెచ్చిన జీవో నెంబర్ 64 దుర్మార్గమైన చర్యగా వారు అభివర్ణించారు. ఈ జీవో వల్ల గత సంవత్సరం నుంచి ఒక్కొక్కరికి రూ.45వేల వరకు వేతనాలు తక్కువ అయ్యాయని, వెంటనే ఈ జీవోను రద్దుచేసి పాత పద్ధతిలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలే తప్ప తగ్గిస్తూ జీవోలు తీసుకురావడం అన్యాయమన్నారు. 8 నెలలుగా వేతనాలు లేకపోవడంతో దసరా పండుగ సమయంలో కుటుంబాలు దుఃఖంతో పండుగ చేయలేని దుస్థితిలో ఉన్నాయని కార్మికుల ఆవేదనను నాయకులు తెలియజేశారు. అర్హులైన అందరికీ వెంటనే టైం స్కేల్ అమలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ చేసే ఆలోచనను విరమించుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చిటమట రమేష్, వర్కర్లు ఎం.నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, సమ్మక్క, విజయలక్ష్మి, రాజు, నందం, సమ్మయ్య, సూర్యతేజ, ఇందిర, సుమలత, సాంబయ్య, శివకృష్ణతో పాటు సుమారు 100 మంది కార్మికులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అమ్మ‘కం..బాదుడు’

- పండగల వేళ.. పెరిగిన ఆన్‌లైన్ కొనుగోళ్లు..
- ఈ-కామర్స్ సైట్లలో భారీగా అక్రమాలు

హనుమకొండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఈ-కామర్స్ సంస్థలు వచ్చిన తర్వాత జనం షాపులకు వెళ్లి వస్తువులు కొనడమే దాదాపుగా మానేశారు. స్మార్ట్ ఫోన్ చేతిలోకి తీసుకోవడం, నచ్చిన ప్లాట్‌ఫాంను ఎంచుకోవడం.. కావాల్సినవి ఆర్డర్ పెట్టుకోవడం.. వారం రోజుల్లో అవి మన గడప దగ్గరకు వచ్చి చేరడం జరిగిపోతోంది. ఈ సులభతర పద్ధతుల కారణంగా మధ్యతరగతి ప్రజలు ఆన్‌లైన్ కొనుగోలు వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు అన్ని బ్యాంకులు క్రెడిట్, డెబిట్ కార్డుల పేరుతో భారీ డిస్కౌంట్లు ఇస్తుండడంతో.. స్థానిక మార్కెట్లను పూర్తిగా మర్చిపోయారు. ఇదే ఈ-కామర్స్ సంస్థలకు వరమైంది. ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకుని ఇష్టం వచ్చినకాడికి వినియోగదారులపై బాదుడు మొదలు పెట్టాయి. రకరకాల ఫీజుల పేరుతో జేబులు ఖాళీ చేస్తున్నాయి. రానున్న దసరా, దీపావళి పండగల సందర్భంగా వచ్చే డిస్కౌంట్ ఆఫర్లతో అప్రమత్తంగా లేకపోతే నష్టపోవడం ఖాయం.

రకరకాల ఫీజుల మోత..

దేశంలో ప్రముఖ పండుగలు దసరా, దీపావళి సందర్భంగా భారీ స్థాయిలో కొనుగోళ్లు జరుగుతుంటాయి. సగటున ప్రతి వంద మంది కొనుగోలుదారుల్లో 70 మంది ఈ-కామర్స్ సంస్థల ద్వారానే వస్తువులు కొనుక్కుంటున్నారని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వీరందరి నుంచి ఈ సంస్థలు వివిధ రూపాల్లో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఒక ఈ-కామర్స్ సంస్థ తన వెబ్‌సైటును వినియోగించుకున్నందుకు ప్లాట్‌ఫాం ఫీజు కింద రూ.5 నుంచి రూ.15, సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ఫీజు పేరుతో రూ.49 నుంచి రూ.59 వసూలు చేస్తోంది. అలాగని ఆర్డర్ పెట్టిన వస్తువు రాకపోతే మాత్రం సంస్థ బాధ్యత తీసుకోవడం లేదు. వీటితోపాటు ఆఫర్ హోల్డింగ్ ఫీజు పేరుతో రూ.149, ఎక్స్చేంజ్ ఆఫర్ కింద పికప్ చార్జీ పేరుతో రూ.99 నుంచి రూ.199 వరకూ వసూలు చేస్తోంది. తాజాగా మరో సంస్థ కూడా ఇదే తరహాలో ఫీజుల వసూలు మొదలు పెట్టింది.

వస్తువు రాకుంటే ఫీజులు గల్లంతే..

ఇంత ఖర్చు చేసి ఒక వస్తువును ఆర్డర్ చేస్తే అది వినియోగదారుడి చేతికి అందితే అదృష్టమే. అందలేదంటే ఆ ఫీజులు మొత్తం పోయినట్లే లెక్క! ఆర్డర్ చేసిన తర్వాత ఆ వస్తువు అమ్మకందారు పంపించకపోయినా, అతడే ఆర్డర్ క్యాన్సిల్ చేసినా సరే.. అదనంగా చెల్లించిన ఫీజులు తిరిగి రావు. వస్తువు ఖరీదు మాత్రమే వస్తోంది. దీంతో వినియోగదారులు అనేక మంది లబోదిబోమంటున్నారు.

థర్డ్ పార్టీలతో ప్రమాదం..

ఈ-కామర్స్ సంస్థలు నమ్మకస్తులైన అమ్మకందారులనే వినియోగదారుల ముందుకు తీసుకురావాలి. కానీ, ఇటీవల థర్డ్ పార్టీ అమ్మకందారులను కూడా తీసుకువస్తున్నాయి. వారు ఇచ్చే ఆఫర్లను బ్యానర్లుగా కూడా ప్రమోట్ చేస్తున్నాయి. ఈ కారణంగా ఎక్కువ మంది వాటి ఉచ్చులో పడుతున్నారు. తీరా వారు ఆర్డర్ చేసుకున్న ప్రొడక్టు పాతది లేక.. రీ ఫర్బిష్డ్ రావడమో జరుగుతోంది. ఈ విషయం తెలియక చాలామంది వాటిని కొత్త వస్తువులుగా భావించి మోసపోతున్నారు.

రిటర్న్ విండో మూసివేత..

ఈ-కామర్స్ సంస్థలు క్రమంగా రిటర్న్ విండోను మూసేస్తున్నాయి. తొలి నాళ్లలో నెల రోజులపాటు రిటర్న్ ఆప్షన్ అందుబాటులో ఉండేది. ఈ సమయంలో ప్రొడక్టుకు ఏదైనా సమస్య వస్తే తిరిగి పంపించే అవకాశం ఉండేది. తిరిగి కొత్త ప్రొడక్టును గానీ, లేదా చెల్లించిన మొత్తాన్ని కానీ రీఫండ్ చేసేవారు. తర్వాత ఈ సమయాన్ని పక్షం, వారం రోజులకు కుదించారు. ఇప్పుడైతే పూర్తిగా ఆ ఆప్షన్‌ను ఎత్తేశారు. రీప్లేస్‌మెంట్ అవకాశాన్ని మాత్రమే ఇస్తున్నారు.

మహిషాసుర మర్దినిగా దుర్గాదేవి దర్శనం



ఏటూరునాగారం రామాలయంలో మహిషాసుర అవతారంలో దుర్గాదేవి

ఏటూరునాగారం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. మండల కేంద్రంలోని స్టార్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం దుర్గాదేవి భక్తులకు మహిషాసుర మర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి దివ్య రూపాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు ఎల్లప్రగడ రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా రామాలయం, సాయిబాబా ఆలయాల్లో పదవ రోజున అమ్మవారు మహిషాసుర మర్ధిని అవతారంలో భక్తులకు ప్రత్యేక దర్శనం ఇచ్చి ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు నూక ప్రభాకర్, సాయి మహంత్, భిక్షపతి, సుమన్, రామాలయ కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కృపకు పాత్రులయ్యారు.

- మహదేవపూర్(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వర త్రివేణి సంగమ పుణ్యక్షేత్రంలో శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన శ్రీ శుభానంద దేవి ఆలయంలో బుధవారం అమ్మవారిని శ్రీ మహిషాసుర మర్ధినిగా అలంకరించారు. ముందుగా ఉదయాన్నే ప్రాతఃకాల పూజ, ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహిషాసుర మర్ధినిగా అలంకరించారు. అనంతరం భక్తుల సందర్శనకు అనుమతి ఇచ్చారు.